**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 04.05.2025** **సమయం:13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె ఆలోచన విరమించి తమతో చర్చలకు రావాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.
2. మావోయిస్టులు ఆయుధాలు విడవనంత వరకు వారితో చర్చల జరిపే ప్రసక్తే లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.
3. రాష్ట్రంలో 6వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన పలు జాతీయ రహదారులను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రేపు ప్రారంభిస్తారు.
4. యంబిబిఎస్ లో ప్రవేశాలను కల్పించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష- నీట్ యూజీ – ని ఈ రోజు నిర్వహిస్తున్నారు.
5. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో జూన్ వరకు వడగాల్పుల తీవ్రత ఉంటుందని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది.

..........................................................

**బండి సంజయ్**

తుపాకీ చేత పట్టి అమాయకులను బలి తీసుకుంటున్న మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కరీంనగర్ లో విలేఖరులతో మాట్లాడుతూ.... ఆయుధాలు వీడనంత వరకూ మావోయిస్టులతో కేంద్రం ఎలాంటి చర్చలు జరపదని ఆయన తెలిపారు. కులగణన పై కేంద్రం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని సంజయ్ అన్నారు. కాంగ్రెస్ చేసిన కులగణన కు, నరేంద్ర మోదీ చేసే

కులగణన కు ఎలాంటి పొంతన ఉండదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కులగణన తో బిసి లకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు.

బైట్ .....................

పిటిసి, కరీంనగర్

**నీట్ పరీక్ష**

యంబిబిఎస్ లో  ప్రవేశాలు కల్పించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష – నీట్ యూజీ – ని ఈ రోజు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఈ పరీక్ష 24 పట్టణాలలోని 190 కేంద్రాలలో జరుగుతున్నది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ పరీక్షకు విద్యార్థులు ఒంటి గంట 30 నిమిషాల లోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. ఒంటిగంటన్నర తరువాత పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 62 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రం మొత్తం మీద 72 వేల 507 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారు. గడియారాలు, బూట్లు, ఇతర గ్యాడ్జెట్లు, నిషేదిత పదార్థాలను తీసుకురాకుడదని విద్యార్థులను ఆదేశించారు. గత ఏడాది నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో ఈసారి పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

డెస్క్

**GADKARI :**

రాష్ట్రంలో దాదాపు 6 వేల 280 కోట్ల రూపాయల వ్యయంతో 285 కిలోమీటర్ల పొడవున నిర్మించిన జాతీయ రహదారులను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రేపు ప్రారంభిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతీయ అనుసంధానతను పెంచుతూ రవాణాపరమైన అవరోధాలను తొలగించేందుకు ఈ రహదారులను నిర్మించారు.  హైదరాబాద్లో 350 కోట్ల రూపాయలతో నిర్మించిన అంబర్ పేట వంతెన, ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు 300కోట్ల రూపాయల

వ్యయంతో విస్తరించిన ఆరు వరుసల రహదారి, BHEL వద్ద వంతెన మొదలైన పనులను కూడా కేంద్రమంత్రి లాంఛనంగా ప్రారంభిస్తారు. 961 కోట్ల రూపాయలతో 51 కిలోమీటర్ల రెండు జాతీయ రహదారి పనులకు నితిన్ గడ్కరీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు.

Desk

**యాడ్ గడ్కరీ**

ఆసిఫాబాద్ జిల్లా లోని కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ వద్ద నాలుగు వరసల జాతీయ రహదారి - 363 ను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రేపు ప్రారంభిస్తారు. (PTC/ASFB)

**పొన్నం ప్రభాకర్**

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం చొరవ తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బస్ స్టేషన్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు ఆకస్మికంగా సందర్శించారు. ప్రయాణికులతో ముచ్చటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ కండక్టర్ ,డ్రైవర్ ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆర్టీసీ సంస్థ పరిరక్షణ ,కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం మూడింటికీ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని, ఈనెల 5,6 తేదీల్లో తమను హైదరాబాద్ లో కలవవచ్చునని ప్రభాకర్ తెలిపారు. రవాణా వ్యవస్థ బాగుండాలని కొత్త బస్సులు కొనుగోలు చేయడంతో పాటు, నియామకాలు చేపట్టామని, , బాండ్స్ ఇచ్చామని,కారుణ్య నియామకాలు చేపట్టామని, డీఏలు ఇచ్చామని ఆయన వివరించారు. ఉద్యోగులు సమ్మె ఆలోచన మాని ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు.

BYTE.................

(PTC/SDP)

**భట్టి విక్రమార్క**

ఖమ్మం జిల్లా మధిర నియోజవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగేలా కృషి చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మధిరలో 138 కోట్ల రూపాయలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన ఈరోజు ప్రారంభించారు. మధిర పట్టణాన్ని సుందరీకరించనున్నట్లు పేర్కొన్నారు. చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. భవిష్యత్తులో ప్రతి రాష్ట్రం ఆదర్శంగా తీసుకునేలా యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నట్టు చెప్పారు.

(PTC/KMM)

**పిల్లలమర్రి**

ఈనెల 16న ప్రపంచ దేశాల నుంచి పాలమూరు జిల్లా పర్యటనకు 22 మంది ప్రపంచ మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న మహిళలు వస్తున్నారని జోగులాంబ మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. వీరి పర్యటన నేపథ్యంలో మూడంచల భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని 700 ఏండ్ల చరిత్ర ఉన్న పిల్లలమర్రిని వీరు వీక్షిస్తారని తెలిపారు.

(PTC/MBNGR)

**యాడ్ పిల్లల మర్రి**

మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే విదేశీ మహిళలు ఈ నెల 14 వ తేదీన ఖిలా వరంగల్ సందర్శన నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. క్లిక్ మార్కెట్ ను ఇతర పర్యాటక ప్రదేశాలను వారు సందర్శిస్తారు. ఈ సందర్భంగా చేనేత స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

పిటిసి, వరంగల్

**భూభారతి**

భూభారతి చట్టం అమలుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నాలుగు మండలాలలో ఒకటైన జనగామ జిల్లా స్టేషన్ ఘన్పూర్ మండలంలో రేపటి నుంచి ఈనెల 13వ తేదీ వరకు రెవెన్యూ గ్రామాల వారిగా సదస్సులు నిర్వహిస్తారు. రెవెన్యూ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి మండలంలోని 13 రెవెన్యూ గ్రామాల్లో ఈ సదస్సులను నిర్వహించి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు. కాగా, సంగారెడ్డి జిల్లాలో భూ భారతి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన కొండాపూర్ మండలంలో కూడా రేపటి నుంచి ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించనున్నారు. మండలంలోని 23 గ్రామాలలో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. (PTC/JGM/SR)

**భగీరథ**

గంగను భూవికి తెచ్చిన మహనీయుడు, భగీరథ మహర్షి జయంతి వేడుకలను రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శ్రీ భగీరథ మహర్షి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏదైనా సాధించాలనే పట్టుదలకు భగీరథ ప్రయత్నం ఒక స్ఫూర్తి అని అన్నారు.

(PTC/RS)

**యాడ్ భగీరథ**

నల్లగొండ కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహర్షి భగీరథ చిత్రపటానికి స్థానిక సంస్థల ఇంఛార్జ్ అదనపు కలెక్టర్ రాజ్ కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహబూబా బాద్ జిల్లాలో జరిగిన మహర్షి భగీరథ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొని – విద్యార్థులు భగీరథున్ని ఆదర్శంగా తీసుకొని పట్టుదలతో విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు.

పిటిసి, నల్లగొండ, మహబూబా బాద్

**రైతు – శాస్త్రవేత్తలు**

మంచిర్యాల జిల్లాలో రేపటి నుంచి జూన్ 13 వరకు రైతు ముంగిట్లో – శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహిస్తారు. ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానం పై రైతులకు అవగాహన కల్పిస్తామని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ కె.శివకృష్ణ ఆకాశవాణికి తెలిపారు.

బైట్ ...............

పిటిసి, మంచిర్యాల

**వాతావరణం**

రాష్ట్రంలోని 13 జిల్లాల్లో జూన్ వరకు వడగాల్పుల తీవ్రత ఉంటుందని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జగిత్యాల, నాగర్ కర్నూల్, కరీంనగర్, వరంగల్, ములుగు, ఖమ్మం, మహబూబా బాద్, మంచిర్యాల, పెద్దపల్లి, నల్గొండ, సూర్యా పేట జిల్లాలో వడగాల్పుల తీవ్రత ఉంటుందని తెలిపింది. పిల్లలు, పెద్దలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. కాగా ములుగు, భద్రాచలం, మహబూబా బాద్, ఖమ్మం జిల్లాల్లో పలుచోట్ల ఈ రోజు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలలుతో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.